సృష్టి

రచయిత్రి : - ప్రముఖ సినిమా నిర్మాత సుబ్బారాయుడిగారి దగ్గర నుంచి నిన్ననే కబురు వచ్చింది- ఆయన తీయబోయే తదుపరి చిత్రానికి కూడా కథను నన్నే వ్రాయమంటున్నారు. 'అందమైన కథ' వ్రాయమని మరీ మరీ చెప్పి పంపించాడు. ఆయన నా నవలను సినిమాగా తీస్తున్నట్టుగా అప్పుడే పత్రికల వాళ్లకి 'న్యూస్' కూడా యిచ్చేశారుట - అంటే ఒక వారం రోజుల లోపలే నవల పూర్తి చేయాలన్నమాట.

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అన్నారు, శ్రీవారు ఆఫీసు నుంచి వస్తూ.

'అదే చెప్పాను కదా - సుబ్బారాయుడిగారి సినిమాకి కథ గురించి ఆలోచిస్తున్నాను' అన్నాను సాలోచనగా.

'వంట అయిందా?!' అడిగారు మామూలుగా.

'అయినట్టే - కూరలో పోపు పెట్టాలి!' అన్నాను లేస్తూ.

ఆయన నవ్వాను. 'ఆ వంట కాదు - నీ నవలను వండటం. ఈసారి పోపు యింకా బాగా పెట్టు - సుబ్బారాయుడికే కాదు, ప్రేక్షకరాయుళ్లకు కూడా ఘుమాయించాలి!'

కోపంగా చూశాను 'నా రచనలనలా తీసి వేయవద్దని మీకెన్నోసార్లు చెప్పాను-'

'కోప్పడకు చిట్టీ - మరి నీ నవలలలోని పాత్రలు సాంఘిక ప్రయోజనం లేకుండా, సహజత్వానికి దూరంగా, ఊహాలోకాల్లో నేల విడిచి సాము చేస్తాయి-' అంటూ దగ్గరకు వచ్చారు.

ఆ రాత్రి కూడా అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాను.

తెల్లవారగానే ఆయన అడిగారు 'కథావస్తువు దొరికిందా?' అని.

'లేదు!' అన్నాను నిరాశగా.

'మళయాళం, బెంగాలీ, కన్నడ వాళ్లలాగా, ఉన్న ఉత్తమమైన కథల్ని, చక్కగా సినిమాలు తీసే అదృష్టానికి మనం నోచుకోలేదు. ఏదో కథ లాంటిది, కథలు వ్రాసేలాంటి వాళ్లచేత, వ్రాయించినట్టు వ్రాయించి, సినిమా తీయాలంటే ఎలా!' ఆయన ఎప్పుడూ విమర్శిస్తూనే వుంటారు.

'మీరు ప్లాటు యిస్తే యివ్వండి. అంతేకాని ఈ ఉపన్యాసాలు నా కక్కరలేదు' అన్నాను విసుగ్గా.

ఆయన కూరల బుట్టకేసి చూస్తూ చటుక్కున ఒకసారి తల ఎత్తారు.

'నేనొకటి చెబుతాను విను. అటు మొన్న బంగాళాదుంపకూర, మొన్న చిక్కుడుకాయ

కూర, నిన్న వంకాయ కూర వండుకున్నాం మన యింట్లో. ఇవాళ వండటానికి కూరలు లేవు. కానీ కూర వండి తీరాలి. అప్పుడు నువ్వేం చేస్తావ్? కూరల బుట్టలో మిగిలిన ఒక వంకాయ, నాలుగు చిక్కుడుకాయలు, ఒక బంగాళాదుంప తీసి, అన్నీ, కలిపి వండేస్తావ్. కాపోతే రుచి కోసం కొంచెం మసాలా కలపాలి అంతే' అన్నారు.

ఆయన ఆఫీసుకు వెళ్లేదాకా ఆయన మాటల్లోని వ్యంగ్యం గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. ఈలోగా, వచ్చిన మేగజైన్‌ను తీసి, పేజీలు తిప్పుతూ ఆలోచిస్తున్నాను. నేనింతవరకూ వ్రాసిన మూడు నవలలూ సినిమాలుగానే వచ్చాయి. నాలుగోది వ్రాయకముందే, సుబ్బరాయుడుగారు దాన్ని సినిమాగా తీయడానికి నిశ్చయించుకోవటమేకాక, ప్రెస్ పబ్లిసిటీకి కూడా యిచ్చేశారు. అది గుర్తుకు రాగానే ఆ మేగజైన్‌లో సినిమా పేజీలు తిప్పాను. దాంట్లో కూడా నా నవలను సినిమాగా తీస్తున్నట్టుగా వుంది. నేను వ్రాసిన (?) అముద్రితమైన నవలను సుబ్బారాయుడుగారు ఈస్ట్‌మన్ కలర్‌లో తీస్తున్న నిజాన్ని విలేఖరిగారు తెలియజేశారు.

'ఈసారి రచయిత్రి బలమైన కథను తీసుకుని, చక్కటి సన్నివేశాలను కూర్చారు. అగ్రనటుడు ఈ కథ చదవగానే, ఆ నవలలోని హీరో పాత్ర తనకి యివ్వకపోతే, యిక సినిమాలలో నటించడం మానేస్తాననే నిజాన్ని తెలిపారు. ఈ నవలలోని హీరోయిన్ పాత్రను షి-వుమెన్ తప్ప యింకెవ్వరూ వెయలేరనే మాట ఈ నవల చదివిన పాఠకులందరూ ఒప్పుకుంటారనే ధైర్యం ఈ విలేఖరికి వుంది. ఈ చిత్రం యింతవరకు కనీవినీ ఎరుగనంతటి గొప్ప సృష్టి' అంటూ ఇంకా ఏదేదో వ్రాశాడు. నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. నేను నవల ఇంకా వ్రాయనేలేదు, అప్పుడే దానికి ఎంత పబ్లిసిటీ వచ్చిందో. ఆ వార్త క్రిందే నాకు సంబంధం లేకపోయినా- యింకో వార్త వుంది.

"ఫలానా స్టూడియోలో 'నటశూర'ను కలసినప్పుడు ఆయన్ని అడిగాను- మీరు ఒకేసారి డెబ్బయి సినిమాల్లో నటిస్తున్నారు, యింత ఓపికకు కారణం ఏమిటో మా పాఠకులకు శెలవిస్తారా అని. ఆయన చెప్పిన నిజాన్ని మీకు కూడా ఉపయోగపడుతుందేమోననే వుద్దేశ్యంతో మీకు చెబుతున్నాను. ఆయన రోజూ పడుకోబోయే ముందు రెండు గ్లాసులు మజ్జిగ త్రాగి పడుకుంటారుట".

ఆ వార్త చదవగానే గొంతు ఎండినట్టయింది. లేచి వెళ్లి, రెండు గ్లాసుల మంచినీళ్లు త్రాగి, కాగితాలు ముందు వేసుకు కూర్చున్నారు.

మా వారు వెడుతూ చెప్పిన 'వంకాయ' కథలో ఏదో సందేశం కనపడ్డట్టయింది. వెంటనే షెల్ఫ్‌లోంచి పబ్లిష్ అయిన నా మూడు నవలలు తీసుకున్నాను- అవి చూస్తూ నాలుగో నవల వ్రాయటం మొదలు పెట్టాను.

ఆ రోజు రాత్రి మావారు, కంచంలో వేసిన కూరను చూసి అదిరిపడ్డారు. "అయితే వంకాయ, చిక్కుడుకాయ, బంగాళాదుంపలు కలిపి కూర వండేవన్నమాట!" అన్నారు.

"ఇంకా పూర్తిగా వండలేదు. వండుతున్నాను!" అన్నాను పుస్తకాలు, మళ్లీ ముందు వేసుకుని.

నిర్మాత :- రచయిత్రి వ్రాసిన నవల్లో హీరోయిన్ బీదపిల్ల. అందుకని హీరోయిన్ ఆ వేషం వేయటానికి అంగీకరించటంలేదు. ఆవిడ ఎర్ర రాళ్ల నెక్లెస్ వేసుకుని నటించిన ''దేవత లాంటి చెల్లెలు'' చిత్రం వంద రోజులు ఆడినప్పటి నించీ, ఆవిడకు అదో సెంటిమెంటు. ప్రతి చిత్రంలో, ఆ నెక్లెస్ వేసుకునే నటిస్తానంటుంది. బీదపిల్లకు ఎర్రరాళ్ల నెక్లెసేమిటి? బుద్ధిలేకపోతే సరి- నేనేదో ఒకటి సినిమా తీసి డబ్బులు చేసుకుందామని, ఈ వ్యాపారంలో దిగితే, యిదేం గోల. కథను మార్చి ఆ అమ్మాయిని ధనవంతుల పిల్లగా చేయకపోతే హీరోయిన్ ఆ వేషం వేయదు. హీరోయిన్ ఆ వేషం వేయకపోతే హీరో ఒప్పుకోడు. పోనీ కథను మార్చి ఆ అమ్మాయిని ధనవంతుల పిల్లగా చూపిద్దామంటే, ఆ అమ్మాయి యింటి సెట్టు కూడా చాల ఖరీదయింది వేయాలి - అదో దండగ. ఇప్పుడు నా పరిస్థితి 'టు బి ఆర్ నాట్ టు బి' లాగా వుంది.

దర్శకుడు :- నాకు ముందే తెలుసు - యిలాంటి గొడవలు వస్తాయని. సుబ్బారాయుడుగారు ఈ విషమ సమస్యను నా ముందు పెట్టాడు. సినిమా రంగానికి వచ్చి ఇన్నాళ్లయినా నా బుర్ర యింకా పనిచేస్తూనే వుంది. నా సలహా విని సుబ్బారాయుడుగారు ఎగిరి గంతేసి, గంతు వేయటం పూర్తికాగానే, ఆయన తీసే తర్వాత చిత్రానికి కూడా నన్నే డైరెక్టర్‌గా పెట్టుకున్నాడు. నేను యిచ్చిన సలహా ప్రకారం హీరోయిన్ బీదపిల్లగానే వుంటుంది ఇలాగయితే వర్గభేదం చూపించటానికి అవకాశం ఎక్కువ. నేల టిక్కెట్లు బాగా సంపాదించుకోవచ్చు. పదిహేడు రీళ్లు ఎంత అవాకులూ, చవాకులూ తీసినా, పద్దెనిమిదవ రీల్లో, హీరో ధనవంతుడయినా బీదపిల్లను చేసుకున్నాడనీ, ఈ సమాజంలో వర్గబేధం వుండకూడదనీ (సోషలిజం అన్నమాట) కాస్త హడావిడి చేసి, మహాత్మాగాంధీ నుంచీ ఇందిరాగాంధీ వరకు ఒకే పాటలో చూపించేస్తే, యిటు సందేశం యిచ్చినట్టు వ్రాసుకోవచ్చు. అటు ఏదో ఒక అవార్డు తగలకపోదు. కాకకపోతే హీరోయిన్, బీద వేషానికి నెక్లెస్ ఎలాగని ఏడవనవసరం లేదు. హీరో రోడ్డు పట్టనంతటి కార్లో వెడుతుంటాడు. అప్పుడు రోడ్డు మీద నడుస్తున్న హీరోయిన్ కారుకి అడ్డమొస్తుంది. కారు ప్రక్కకు పోవటానికి చోటు వుండదు. అప్పుడు హీరో కోపంగా చూద్దామనుకుని ఆమె కళ్లల్లోకి ప్రేమగా చూస్తాడు - ఆమె కూడా అతని వేపు చూస్తుంది - అప్పుడు కారు వైపర్లు అటూ యిటూ కదులుతాయి. వైపర్లు వాన నీళ్లని (వానా?) తుడుస్తుంటే, ఏదో మసకమసకగా కనిపిస్తూ వుంటుంది. ఆ మసక మాయమవగానే, మబ్బులు, పెద్ద పెద్ద స్తంభాలు, మెట్లూ, బోలెడు లైట్లు వ్రేలాడదీసిన ఎన్నో రంగులు నైలాన్ చీరలు వుంటాయి. అంటే అది వాళ్లకు వచ్చే కలలోని సెట్టింగ్ అన్నమాట. ఆ కలలో హీరోయిన్ ఒక రాకుమారి. హీరో ఒక రాజకుమారుడు. ఇద్దరూ గంతులు వేసి పాట పాడుతూ, పాట పాడి మళ్లీ గంతులు వేస్తూ వుంటారు. అప్పుడు హీరోయిన్ మెడలో ఎర్ర రాళ్ల నెక్లెస్ వుంటుందన్న మాట. అదీ కథ! ఈ మధ్య తెలుగు ప్రేక్షకులు దర్శకత్వంలో లోపాలు పట్టేటంత గొప్ప వాళ్లయినారని ఒక దుర్వార్త. అయినా ఏం ఫరవాలేదు. పాటల రచయిత చేత ఒక కైపు పాట పెట్టేస్తేసరి. పేక్షకులు ఆ మత్తులో, మాయలో పడిపోతారు. హీరోయిన్‌కు మొత్తం బట్టలన్నీ ఒక పావు మీటర్ సీత్రూ నైలాన్‌లో

కుట్టించేస్తే నిర్మాతకి ఆదా, ప్రేక్షకులకు కిక్కు - సెన్సార్ వాళ్ళ సంగతి సుబ్బారాయుడి గారి బామ్మరిదికి వదిలేస్తే సరి.

పాటల రచయిత :- ఈ బూతు పాటలు వ్రాసి విసుగు పుట్టేస్తున్నది - ఏమీ బూతుల్లేకుండా, కాస్త కవిత్వంతో చక్కగా సినిమాకు పాటలు వ్రాసి అయిదారేళ్లు దాటిందేమో. ప్రతి నిర్మాతా అలాటివే వ్రాయమంటే, మరేం చేయాలి. నేను బ్రతకొద్దూ ? మొన్నెవడో కాలేజీ స్టూడెంట్ పుత్తరం వ్రాశాడు. అంతటితో ఆగలేదు. మీకు డబ్బులే ముఖ్యమైతే ఆంధ్రదేశంలోని ముఖ్యనగరంల్లో ముష్టెత్తుకువచ్చి, విద్యార్థులమంతా మీకు డబ్బు యివ్వగలం - అలాటి పాటలు వ్రాసి యువతరాన్ని బల హీనం చేయవద్దని వ్రాశాడు. టూ ఫేస్డ్ ఫెలోస్ అలా మనని తిడుతూనే వుంటారు, మళ్లీ మనం వ్రాసిన పాటలకు కాళ్లూ, తలలూ వూపుతుంటారు.

ఏ మయితేనేం సుబ్బారాయుడుగారు, ఈ సారి సినిమాలో, ఒక అమ్మాయికి పావు మీటర్ బట్టతో పూర్తి దుస్తులు కుట్టిస్తున్నాడుట. అక్కడ ఓ 'మంచి' పాట రాయమంటాడు. ఏం రాయను? నాకు వచ్చిన బూతులన్నీ యింతకు ముందు పాటల్లోనే వచ్చాయి. మాటలు దొరక్క ఎన్నాళ్లిలా ఖాళీగా కూర్చోవటం .... ఏదో ఒకటి చేయాలి ....ఆఁ! ఆఁ!... దొరికింది పల్లవి ఈ మాటల తోనే ఒక పాట రాసేస్తే సరి. '*ఖాళీగా వున్నాను మామా - ఖాళీగా వున్నాను. ఏదో ఒకటి చేయరా మామా త్వరగా రారా మామా ...* ' బాగానే కుదురుతుంది. - నేను రాసేది తిరుపతి వేంకటేశ్వర్లు చూస్తున్నాడు కాబోలు - ఈ పటం ప్రక్క గదిలో పక్క మీద పడేస్తే మంచిది. నా బాధ తిరుపతి వెంకన్నకీ, ఆయన బాధ నాకూ తప్పుతుంది.

అభిమాన సంఘం :- రిక్షాలో "నటశూర" పటాన్ని పెట్టి ఊరంత తిప్పి తొమ్మిది గంటలకల్లా థియేటర్ దగ్గరకు తెచ్చేయాలి. తర్వాత ఆయన పటానికి, దండవేసి హారతి యివ్వటం, కొబ్బరికాయ కొట్టటం. సినిమాలో మొదటిసారిగా ఆయన కనపడ్డప్పుడు, 'జై' కొట్టలానికి ఇరవై మందిని మాట్లాడ మని 'ఆయన' యిచ్చిన డబ్బుతో పది మందిని పెట్టేయాలి. ఈ సినిమా వంద రోజులు ఆడాల్సిందే. "అవతలివాడి" సినిమా ఈ దెబ్బతో మట్టి కొట్టుకు పోవాల్సిందే!

రిక్షా తొక్కుకునే అప్పడు:- ఏటే నూకాలమ్మా, ఈ చినిమా బాగుంటాదని సెప్పితీసుకొచ్చినావ్! ఎదవ చినిమా అని ఎదవ చినిమా! తలా తోకా లేకుండా ఏటేయిది? ప్రొద్దుటాలనించీ రిచ్చాఏస్తే వచ్చిన రెండ్రూపాల్లో నాయాల్డి రూపాయిన్నర తగ లేసాం ఈ ఎదవన్నర చినిమాకి. ఆ బాబు సదువు కున్నాడు గందా ఏటే ఆ బాస దురిద పుదుతుంది అంటూ ఆ పిల్ల ఎంబడి పడతాడు. ఆ ఆడకూతురేమొ కాలీగా వున్నాను, కాలీగా వున్నాను అంటది. పద యింటికి పోయి సుకంగా నిద్దరన్నా పోదాం.

తెలుగు సినిమా అభిమాని అనబడే ఒకానొక మూర్తి:- అపూర్వ సృష్టి అయిన ఈ చిత్రానికి ప్రభుత్వం కనీసం ప్రాంతీయ బహుమానమైనా యివ్వక పోవటం అన్యాయం. మహా అన్యాయం!

రచయిత:-ఇదీ సార్ 'సృష్టి' కథ!